కథానిక

# కవయిత్రి భర్త

—మొవ్వ రాంబాబు

కాంతారావు ఇంతపనీ చేశాడంటే మేం ఎవ్వరం నమ్మలేదు. ముఖ్యంగా నేను ఎట్లా నమ్ముతాను చెప్పండి? సరిగ్గా రెండు రోజులకిందట ఇదేసమయంలో ఇద్దరం కూర్చుని మాట్లాడుకున్నాం. నేను కాంతారావు చిన్నప్పటినుంచీ స్నేహితులం. పైగా నేను ఇక్కడ జిల్లాకోర్టులో ప్రాక్టీస్ పెట్టిన తేదీ లగాయితూ వాడికి తెలిసిన కేసులన్నీ నాకే ఇప్పిస్తున్నాడు.

'ఏంరా! ఇలావచ్చావ్?' అన్నాను నవ్వుతూ. వాడు ఏమీ మాట్లాడకపోవటం చూచి 'ఇంటివైపు వద్దామనుకుంటున్నాను. మీ శ్రీమతి ఎట్లా ఉన్నది?' అన్నాను.

'ఆ శ్రీమతిని గురించే నేను ఇక్కడకు వచ్చింది!' అన్నాడు కోపాన్నంతా వెళ్ళగ్రక్కుతూ. 'ఆమె పుస్తకాన్ని చదివావా?'

'ఓ! చక్కగా చదివాను. ఆడవాళ్ళే రాస్తున్నారు మనకన్నా చక్కగా కవిత్వాన్ని! అందులో మన పద్మావతి వ్రాసింది' అన్నాను.

'ఆడవాళ్ళేమిటి! కవిత్వం వ్రాయడమేమిటి!' అన్నాడు.

'అదంతా పిచ్చిమాట. ఆడవాళ్ళు వ్రాయటం మవ్వ అనుకునేంత ఘోరంగా నాకేమీ కనుపించటం లేదు. పైగా పద్మావతి వ్రాసినందుకు మనమంతా సంతోషించాలి!' అన్నాను.

వాడు మొఖం చిట్లించి 'పిచ్చిపిచ్చిగా వాగకోకు! వ్రాసిందంతా స్వవృత్తాంతమని ఆమె చెపుతూ ఉంది. పైగా అందరికీ కనబడతూనే ఉంది. ఈ ప్రపంచంలోకల్లా నాకే తెలియకుండా ఉన్నది ఆమె ఈ రెండో భర్త ఎవరో!' అన్నాడు.

'నీ మొఖం. అదంతా కవిత్వం. కవిత్వంలో భావాలకి అంతుఉండదు. వ్రాసిన ప్రతివిషయం జరిగిందనుకోటానికి ఎట్లావీలవుతుంది?' అన్నాను.

'అదంతా కల్పనే అని చెప్పగలవా' అనడిగాడు. వాడి మొఖం, ఆ కళ్ళు చూచేటప్పటికి నాకు నిజంగా భయం వేసింది. నేను ఏమీ మాట్లాడలేదు.

'నన్నడుగుతావేం? పోయి పద్మావతినే అడుగు' అన్నాను.

* * *

అసలు జరిగిన విషయమేమిటంటే దాదాపు ఒక రెండు మూడు నెలల క్రితం ఒకరోజు ప్రొద్దున కాంతారావు, పద్మావతీ కాఫీ త్రాగుతూ కూర్చున్నారు. పోస్టుమేను ఒక పుస్తకాల పార్సిలు రెండు మూడు ఉత్తరాలు కాంతారావు కిచ్చాడు. పుస్తకాల పార్సిలు పద్మావతికి. ఆమె ఇష్టప్రకారమే అతడు పార్సిలు విప్పి పుస్తకాలు బయటకు తీశాడు. డజను పుస్తకాలు ఒకటే రకం.

'డజను పుస్తకాలు ఏం చేసుకుంటావు? పుస్తకాల కేమన్నా కరువొచ్చిందా?' అన్నాడు ఆమె ఏమీ మాట్లాడలేదు. పుస్తకం తెరవంగానే ఆమె పేరు ఉన్నది. అతనికి ఆశ్చర్యం వేసింది.

'అయితే ఈ పుస్తకం నీవే వ్రాశావన్నమాట. ఎప్పుడూ చెప్పనేలేదే?' అంటూ ఒక పుస్తకం తీసి చదవటం మొదలుపెట్టాడు.

'అది మీకేమి బాగుండదు లెండి!' అంటూ ఆమె ఇంట్లోకి వెళ్ళిపోయింది. కాంతారావు నవ్వుతూ పుస్తకం మొదలుపెట్టాడు కాని అతనికి కవిత్వం అంటే గిట్టదు. చిన్న చిన్న కథలు చదవమంటే చదవగలడుగాని కవిత్వం చదవటానికి అతనికి ఓపికలేదు. పైగా అది శృంగార సాహిత్యం. శృంగార సాహిత్యం అని పీఠికలో చదివేటప్పటికి ఉదాసీనంగా పుస్తకం అక్కడపెట్టి లేచాడు.

మా కాంతారావుది ఈ దగ్గరలోనే ఒక గ్రామం. మనవాడిలో కొద్దిగా జాతీయోద్యమం బీజాలు ఉండటంవల్లనో ఏమో భూమి అంతా ముగతా కిచ్చి పట్టణంలోనే ఉంటున్నాడు. వాడికి వయస్సు సుమారు ముప్పయి. పద్మావతికి సుమారు పాతిక సంవత్సరాలుంటాయి. ఆమె చాలా ఆస్తి తెచ్చింది. వారిద్దరూ చక్కగా ఉంటూండేవారు. అక్కడ పల్లెలోగాని ఇక్కడగాని మా కాంతారావుకి చాలా పరపతి ఉన్నది. కాంతారావు డబ్బున్నవాడు కనుక ఏదో ధర్మ సంస్థలకి చందాలు ఇవ్వటం, వసూలు చేసిపెట్టటం ఇటువంటివి చేస్తుండేవాడు. పైగా జాతీయవాది, మంచి గుణాలుకలవాడు. పద్మావతి కూడా చాలా మంచిది. మితభాషిణి. పెద్ద అందకత్తె కాకపోయినా, మనిషి ఆకర్షణీయంగా ఉంటుంది. ఖద్దరే ధరిస్తుంది. దుస్తుల్లోగాని అలంకరణలోగాని ప్రత్యేకత, నాజూకుతనం ఏమి చూపించదు. నాజూకుతనం ఏమిటో తెలియనట్లుగా ఉంటుంది. మొదట్లో ఆమె తనకు భార్యగా చక్కగా సరిపోతుందనుకున్నాడు కాంతారావు. కాని కొద్ది సంవత్సరాలు గడచిపోయినతర్వాత ఆమెకీ తనికీ ఏవిధమయిన పోలికలు లేవని గ్రహించాడు. అంటే తను పొలిటికల్‌గా సేవ చేస్తుంటే ఆమె ఆ విషయమే పట్టించుకోదు. వాళ్లు పల్లెటూళ్ళో ఉంటున్న రోజుల్లో అతడు పట్టణం వారానికి రెండు మూడు పర్యాయాలు వస్తుండేవాడు. అతడు ఎందుకు వస్తుంటాడో తెలుసుకోవాలని ఆమెకు కుతూహలం కలగలేదంటే ఏం చెప్పాలి! ఆమె విద్యాహీనురాలని అనటానికి కూడా వీలులేదాయె. కాంతారావుకన్నా ఇంకా చదువుకున్నది. ఉత్తమ సంస్కారి. కవిత్వం వ్రాస్తుంది.

'నీ పుస్తకం చదివాను. చాలా బాగుంది' అన్నాడు కాంతారావు భోజనంచేస్తూ భార్యతో. కాంతారావు పుస్తకం చదవలేదు. ఆమె మాట్లాడలేదు.

కొద్దిరోజుల వరకు అతడు బహు జాగ్రత్తగా పుస్తకం సంగతి ఎత్తకుండా ఊరుకున్నాడు. ఆమె అసలే ఆ విషయం ప్రస్తావించేదికాదు. అంతా మామూలుగానే జరిగిపోతున్నది. ఒక రోజున వాళ్ల జాతీయోద్యమం ఆఫీసువద్ద ఒక మహిళామణి కాంతారావుని అడిగింది. 'ఏమండీ కాంతారావుగారు. మీ భార్యేనటగదండీ ఆ పుస్తకాన్ని వ్రాసింది, ఎవరినోటినుంచి విన్నా ఆ పుస్తకాన్ని గురించే!' అన్నది. కాంతారావు ఏమీ తెలియనట్టు నటిస్తూ 'మీరనేది నాకేమి అర్థంకాలేదు' అన్నాడు.

'సరే చెప్తా వినండి! మా స్నేహితుడు క్రిటిక్ ఒకడు ఉన్నాడు. బాగా పేరు మోసినవాడు. ఇక్కడకి అప్పుడప్పుడు వస్తుంటాడు. నిన్న ఒక పుస్తకాన్ని చేతపట్టుకు వచ్చాడు. 'అదేంపుస్తకం? నాకు చదువుకోటానికి ఇవ్వరా' అని అడిగాను. 'అది పొయట్రీ. రివ్యూ వ్రాయాలి. అమోఘంగా ఉన్నది. వేడి వేడి చపాతీలల్లే అమ్ముడుపోతాయి పుస్తకాలు' అన్నాడు. 'ఎవరు వ్రాసింది?' అన్నాను. 'ఎవరో ఈఊరు ఆమే నట' అని పూర్తిపేరు చెప్పాడు. మీ ఇంటిపేరుబట్టి గ్రహించగలిగాను' అని అంది. 'రెండుమూడు రోజుల్లో ఆ క్రిటిక్ మీ ఇంటికి వస్తానన్నాడు' అనికూడా అంది.

ఆ మరుసటిరోజు సాయంత్రం పనలు పూర్తి చేసుకొని వస్తూంటే పాతస్నేహితుడు ఒకడు షాపులో కూర్చుని పిలిచాడు. ఈ స్నేహితుడిది పుస్తకాలషాపు. లోకల్ పబ్లిషర్.

'ఏంరోయ్. కవయిత్రి అయిన భార్యతో కాపురం చేయటం ఎట్లా ఉన్నది?' అన్నాడు కాంతారావు భుజంమీద చరుస్తూ.

ఇద్దరూ కాఫీహోటల్‌కి దారితీశారు.

'ఆ పుస్తకం భలే అమ్ముడుపోతుంది. కాపీరైటు ఎంతకిచ్చారు?' అన్నాడు పబ్లిషర్. ఇంతలో ఎవరో కనుపించాడు.

'ఇటు రారా సూరి! ఇక్కడ కూర్చుందువు గాని' అని వచ్చిన స్నేహితుణ్ణి తన టేబిల్ దగ్గర కూర్చోపెట్టాడు. సూరి చక్కని యువకుడు. కళ్ళజోడు, ఫ్రెంచి కట్టింగ్ మీసం.

'మన రామచంద్రయ్యగారి అబ్బాయిరా' అంటూ కాంతారావుకి అతన్ని పరిచయంచేశాడు. అతడే కళా విమర్శకుడని కాంతారావు గ్రహించాడు. కాంతారావు పద్మావతిగారి భర్త అని తెలిసిన తరువాత సూరి అత్యంత ఉత్సాహంతో 'పద్మావతిగారికి నా అభివంద

నాలు చెప్పండి. ఇంకో ముఖ్యమయిన విషయం మీ ఇంటి అడ్రస్ నాకు ఇచ్చిపోవాలి' అన్నాడు.

'దానిదేముంది లెండి' అన్నాడు కాంతారావు.

ఆమె పుస్తకాన్ని రివ్యూ చేసినందుకి నాకు చక్కగా ఒక ఉత్తరం వ్రాసింది. రచయితలు సామాన్యంగా విమర్శకులను అర్థం చేసుకోరు. చేసుకోటానికి ప్రయత్నించరు కూడాను. పద్మావతిగారి పుస్తకం చాలా గొప్పది. భావాలు స్పష్టంగానూ భాష తేలిగ్గానూ ఉన్నది. మామూలు ప్రజలందరికీ అర్థమవుతుంది' అని చెప్పి కొద్దిగా ఆగి సిగరెట్టు ఒకటి వెలిగించి మళ్ళా 'అన్నిటికంటె చెప్పుకోదగ్గది, ఆ పద్యాల్లో అడుగడుక్కీ రచయిత్రి సౌందర్యోపాసన, తృష్ణ కనబడుతుంది. ఇవన్నీ మీరు నమ్మరు కాని, ఇరవయి సంవత్సరాలనుండి ఇంతటి అమోఘమైన పుస్తకం తెలుగులో వెలువడలేదు. ఇది ఓ కళాఖండం' అన్నాడు మిస్టర్ సూరి.

'సరే మంచిదే. ఇవన్నీ పద్మావతి విని ఉన్నట్టయితే ఇంకా బాగా సంతోషించేది. టైము చాలా అయింది నేను వెళ్ళాలి' అంటూ లేచాడు కాంతారావు.

'ఇదొక న్యూసెన్సు' అనుకుంటూ కోపంగా ఇంటికి వచ్చాడు.

రెండురోజుల తర్వాత కాంతారావు పని మీద మద్రాసు వెళ్ళాడు. వాళ్ళ రాజకీయోద్యమం ప్రచురణశాఖ అధిపతిగారు ఒకాయన కనిపించాడు. అతడు కాంతారావుకి స్నేహితుడుకూడా.

'మొన్న చాలామంది రచయితలకి డిన్నర్ చేయించాం. మీరు రాకుండా ఉండటం బాగలేదండీ' అన్నాడు.

కాంతారావు ఆశ్చర్యపోయాడు. వీరు ఆహ్వానించినట్లు గ్రహించాడు. తన భార్య తనకు తెలియకుండా ఆహ్వానాన్ని తిరస్కరించి ఉంటుందని అనుకున్నాడు. ఆమెమీద భలే కోపం వచ్చింది.

ఇంటికి తిరిగి రాగానే ఆవిషయం అడిగాడు, తనకు చెప్పకుండా ఆహ్వానాన్ని ఎందుకు తిరస్కరించిందోనని.

ఆమె నవ్వుతూ 'ఇటువంటివన్నీ మీకు ఇష్టముండవేమోనని, పైగా అక్కడకుపోతే నేను ఒక్కదాన్నే ఆడదాన్ని అవుతానని' అని అంది.

కాంతారావు మనస్సు శాంతించింది.

'వచ్చేవారం తెనాలిలో సాహితీ సమ్మేళనం మీటింగు ఉన్నది. మన కాహ్వానం వచ్చిందికూడాను. అక్కడికి వెళదాం లెండి!' అన్నది.

ఆడదాని ఖ్యాతిమూలంగా, తనని పిలిచారు అనేటప్పటికి ఆతనికి చీదర వేసింది. ఎప్పుడయితే తన భార్యమూలంగా తనకు కీర్తి అన్న తలంపు వచ్చిందో అప్పుడే మొఖం చిట్లించి 'ఆనాటికి చూద్దాంలే' అన్నాడు. కాని సాహితీ సమ్మేళనం సభకు అతడుకూడా భార్యను వెంటపెట్టుకొని వెళ్లాడు. ఆ సభవారు తన భార్యకు చేసిన గౌరవం చూసేటప్పటికి అతనికి ఆశ్చర్యం వేసింది. ప్రతివారు అతనికి పరిచయం చేయబడ్డారు. కాని 'పద్మావతి'గారి భర్త అని పరిచయం చేయబడటం అతనికి కొంచెం కష్టంవేసింది. పైగా ఆమె పుస్తకాన్ని పబ్లిష్ చేసింది ఆ సమితివాళ్ళే. సమితి అధ్యక్షులు కాంతారావుతో మాట్లాడుతూ 'నీ భార్యని చూచి సంతోషించాలోయ్. పుస్తకం అమోఘంగా ఉన్నదంటే నమ్ము. లేకపోతే మేము పబ్లిష్ చేస్తామా? ముఖ్యంగా ఆడవాళ్ళల్లో ఇటువంటి పుస్తకం వ్రాసే శక్తిగలవాళ్ళు ఇంకా ఉన్నారంటే నేను అదిరిపోయానోయ్!' అన్నాడు.

కాంతారావుని మొదటినుంచీ ఒకటి పీడిస్తూంది. ఏమిటంటే ఇతని భార్య పుస్తకం ప్రకటించబడింది మొదలు, ఇతన్ని ముఖ్యంగా ఆడవాళ్ళు ఒకరకంగా చూడటం మొదలుపెట్టారని. ఈ సభ సమావేశాల్లో ఇద్దరు మహిళలు ఇతనివంకే చూడటం మొదలుపెట్టి నవ్వుతున్నట్లుగా కనిపించింది. వాళ్ల సంభాషణ ఏమిటో ఆలకిద్దామనుకున్నాడు గాని వీలుకాలేదు. తన్ను గురించేనని అతని అనుమానం. అందరూ తన వంకచూచి నవ్వినట్లుగా వుంది కాంతారావుకి. యావత్తు ప్రపంచమూ తనను చూచి వెక్కిరించినట్లుగా తనను అపహాస్యం చేస్తున్నట్లుగా తోచింది అతనికి. తనవంటి జాతీయ సేవకుణ్ణి

కొద్దో గొప్పో ప్రజాసేవకుణ్ణి వీళ్ళందరూ ఎందుకిట్లా చూడడం? ఇదివరకు స్త్రీలు కవిత్వాలు వ్రాయలేదా? కవిత్వం వ్రాసిన అందరి స్త్రీల భర్తలను చూచి ఇట్లాగే నవ్వారా?

ఇంక ఆ సభలో కూర్చోలేకపోయాడు. భార్యతో చెప్పి అప్పటికప్పుడే స్టేషనుకు బయలుదేరాడు తన పట్టణం రావటానికి. స్టేషన్లో ఒక పత్రిక కొన్నాడు చూడటానికి. ఆ పత్రిక చివర తన భార్య పుస్తకంమీద రివ్యూ ఉన్నది. పుస్తకాన్ని తారాపథానికి పొగుడుతూ, అదే మాటలలో చెప్పాలంటే 'తెలుగు సాహిత్యంలో ఒక అపుర కళాఖండము' అని ఉన్నది. అప్పుడనిపించింది కాంతారావుకు, పుస్తకం చదవకుండానే తన భార్య గొప్పతనానికి ఈర్ష్యపడుతున్నానే అని. అక్కడికక్కడే స్టేషన్ పుస్తకాల షాపులోనే ఒక పుస్తకం కొనుక్కొని రైలు రాంగానే ఒకమూలగా కూర్చుని చదవటం మొదలుపెట్టాడు.

పుస్తకంలో రచయిత్రి స్వయంగా ఆత్మకథ చెపుతున్నట్లుగా ఉన్నది. కాంతారావుకి పొయిట్రీ చదవటం ఇష్టంలేకపోయినా అర్థం కానంత మూర్ఖుడు కాదు. పుస్తకం యాభై పేజీలు కూడా లేవు. ఒకచక్కని ప్రేమికులకథ. ఒక యవ్వనదశ అంతా దాదాపుగా పూర్తిఅయిపోయినటువంటి ఒక స్త్రీ ఒక యువకుణ్ణి చూడగానే ఆమెలో పూర్వం అడుగారిపోయిన కోర్కెలు తిరిగి విజృంభిస్తవి. ఆమెకు వివాహమయి చాలాసంవత్సరాలయినాయి. ఆమె భర్త చాలా మంచివాడే గాని సామాన్య మానవునికి ఉన్నంత అయినా రసికత్వం మొదలైనవి లేకపోవటం వల్ల ఆమె సహజమైన కోర్కెలు ఇంతవరకు నిద్రావస్థలో ఉన్నవి. ఇటువంటి సమయంలో ఒక కుర్రవానితో పరిచయమవుతుంది. ఇతను ఆమెకన్న చాలాచిన్నవాడు. ఆమె అంటే అతనికి కూడా యిష్టమే. ఆమె సంఘ మర్యాదలని ఆచారాలని అన్నిటికన్నా తన భర్త గౌరవాన్ని అమాయకత్వాన్ని నాశనం చేయదలుచుకోలేదు. కాని విధి బలవత్తరమయింది. ఆమెంతగా ఆ కుర్రవాణ్ణి మరిపోలనుకుంటుందో అంతగా అతన్ని ప్రేమించటం మొదలుపెట్టింది. భర్తను మోసగిస్తున్నాను అది క్షమించరానిది అని ఒకవైపు, రెండవవైపు తన కోర్కెలు ఇన్నాళ్ళనుంచి అణగ ద్రొక్కబడ్డాయి. ఇంక ఇప్పుడయినా ఉన్నకొద్ది జీవితాన్ని అనుభవించాలనిమరొకవైపుమథనపడి చివరకు ఆకుర్రవాడితో లేచిపోతుంది. తరువాత శృంగార వర్ణనలు.

చదువుతూంటే కాంతారావు హృదయంలో బరువుగాఉన్నది. తర్వాత కొద్దిగా మొఖంచిట్లించాడు. రెండవభాగంలో విషాదాంతం. వారిద్దరూ అట్లాయుగాల్ని సంవత్సరాలుగా సంవత్సరాల్ని రోజులుగా అత్యంత ఆనందంతో గడుపుతూ ఉన్నప్పుడు హఠాత్తుగా ఆ కుర్రవాడు చనిపోయాడు. ఎందుకు చనిపోయాడో ఎట్లా చనిపోయాడో ఎక్కడో కూడా చెప్పబడలేదు. ఆమె హృదయం తల్లడిల్లిపోయింది. అయినా ఏమి చేస్తుంది? చివరి పద్యం మాత్రం జీవితంలో కల్లా మరువరానిది. ఆమె తనకు జరిగిన ఈ అన్యాయానికి ఏమీ చేయలేక ఆ కుర్రవాడితో గడిపిన రెండు సంవత్సరాలే తన జీవితంలోకల్లా స్వర్ణదినాలలాంటివనీ, భగవంతునికి దయగనక ఉంటే మళ్ళీ అతన్ని పంపించవలసిందనీ కోరుకోవటంతో పుస్తకం పూర్తిఅవుతుంది.

కాంతారావు పుస్తకం చదివిన తర్వాత ఆపాదమస్తకం కంపించిపోయాడు. పద్మావతి రాగానే వాకిట్లోనే నిలబెట్టి పుస్తకం మొఖానకేసి కొట్టి దానిలో వ్రాయబడిన విషయమేమిటో అట్లా ఎందుకు వ్రాయవలసి వచ్చిందో అడుగుదామనుకున్నాడు. కొద్దిసేపు ఆలోచించగానే అతనికి అది ఏమంత మంచి పనిగా తోచలేదు. పద్మావతే ఆ పుస్తకంలోని స్త్రీ అని నిరారణేమిటి? పైగా తను క్రిందటిసారి 'పుస్తకం చదివాను చాలా బాగుంది' అని అన్నట్లు జ్ఞాపకం వచ్చింది. అటువంటప్పుడు తను ఆమెను సంజాయిషీ అడిగితే మూర్ఖుడుగా కనబడడూ? బహు జాగ్రత్తగా ఆమె స్వభావాన్ని కనిపెట్టాలనుకున్నాడు. ఇన్నాళ్ళు లేనిది ఇప్పుడు ఏమి స్వభావమని మళ్ళీ అనుకున్నాడు. ఆమరునాటిరోజు ప్రొద్దున పద్మావతి ఇంటికి వచ్చింది. ఆమె బండి దిగుతూంటే కాంతారావు కిటికీలోనుండా ఆమె మొఖవంక చూశాడు. ఆ పూర్వపు ఉదాసీనత కొద్దిగా అమాయకత్వము వస్త్రధారణలో నిరాడంబరత్వము, ఉన్నవి.

ఇప్పుడేనా రావటం? అన్నాడు.

'ఇప్పుడేనండీ' అంటూ ఆమె ఇట్లోకి వెళ్ళింది. ఇంట్లో మళ్ళీ అంతా మామూలుగానే జరిగిపోతూంది. ఇది జరిగిన కథ.

రెండు మూడు రోజులైన తరువాత నా దగ్గరకు వచ్చాడు.

అప్పుడే నేను 'నన్నడుగుతావేం? పోయి పద్మావతినే అడుగు' అన్నాను.

'సరే అట్లాఅయితే డైవోర్సు ఇచ్చివేస్తాను భాగాలు పంచు. కాగితాలు తయారుచెయ్యి' అన్నాడు.

'నేను చెయ్యను. నీకు అంత అవసరంగా ఉంటే ఇంకొక ప్లీడరు దగ్గరకు పో! ఏదో ఒక పుస్తకం ఆధారంగా తీసుకొని ఆమె కారెక్టరుని శంకించటం మంచిదికాదంటే వినవేం? కోర్టులో ఎట్లా ఋజువు చేస్తావు?' అన్నాను.

కాంతారావు ఏమీ మాట్లాడలేదు.

'నేను అట్లాగే అనుకున్నానోయ్. ఇల్లు చక్కగా నడిపేది. మాకెప్పుడూ పోట్లాటలు లేనేలేవు. కాని ఆమెకు నామీద ఇష్టం లేదని తెలుసుకున్నాక ఆమెతో ఎట్లా కాపురం చేయటం?' అన్నాడు.

కొద్దిసేపు ఆగి మళ్ళా 'ఇంతకీ ఆ కుఱ్ఱవాడు ఎవరంటావు?' అన్నాడు.

'నాకేం తెలుసు.'

'దీనికంతకు తెలియనిది నేను ఆమెతో కాపురం చెయ్యలేను. ఇప్పటికే అందరూనన్ను చూచినవ్వుతున్నారు. బజార్లో మొఖమెత్తుకొని తిరగటానికి వీలులేకుండా ఉన్నది' అన్నాడు.

'నాన్సెన్సు. ఇదంతా ఒకవేళ జరిగిఉంటే ఆ కుఱ్ఱవాడెవడో చనిపోయాడని వ్రాసిఉంది. నువ్వెందుకు సిగ్గుపడటం. నువ్వు కూడా అందరి ముందూ నీభార్య పుస్తకాన్ని గురించి పొగుడుతూ ఉండు. ఆమెకు భర్తఅయినందుకు గర్వపడుతున్నట్లుగా కనబడుతూ ఉండు. నిన్ను ఎవరూ వేలుపెట్టి చూపించలేరు. కొన్నాళ్ళయిన తర్వాత అన్నీ సర్దుకుంటాయి.'

వాడు ఒక నిట్టూర్పు విడిచి 'అందరూ మరిచిపోయినా నేను మరచిపోలేను. కాని నువ్వు చెప్పిందే ఉత్తమంగా ఉన్నది. దీనిమీద ఏమి చేసినా అంతా నాకే చుట్టుకుంటుంది. సరే' అంటూ నెమ్మదిగా తలవంచుకొని బయటకు వెళ్ళిపోయాడు.

కాని ఈరోజు పోస్టులో ఉత్తరం వచ్చింది. కాంతారావు మద్రాసువెళ్ళాడు. అక్కడ నుంచి నాకు ఉత్తరం వ్రాశాడు. తన భార్య శీలంలో లోపాలు ఉన్నప్పటికీ లేకపోయినప్పటికీ తనకన్నా గొప్ప ప్రతిభ గల భార్యతో కాపురం చేయటం కష్టమనీ అందువలన తాను శాశ్వతంగా ఆమెను విడిచిపెట్టవలసి వచ్చిందనీ తెల్పాడు. ఆస్తి భాగాలుచేసి తన భాగానికి నన్నే రిసీవరుగా ఉండి తనకు అడిగినప్పుడల్లా డబ్బు పంపించమన్నాడు. నేను నమ్మలేకపోయాను. నమ్మనుంటారా?

(మాతృక : 'ది కర్నల్స్ లేడీ' అనే
సోమర్ సెట్ మాఘమ్ కథ)

అయిదుగురు అల్లరి పిల్లలతో బస్సులో ప్రయాణం చేస్తున్న ఒకతల్లి వాళ్లని అదుపులో పెట్టుకోలేక మాటిమాటికీ కండక్టరు సహాయంకోరింది. చివరకు గమ్యస్థానం వచ్చి దిగిపోయేటప్పుడు కూడా తన కడపటి బిడ్డను అందివ్వమని అడిగింది. దాంతో విసుగెత్తిన కండక్టరు:

"అమ్మా, ఇకమీదట మీరు ప్రయాణం చేసేటప్పుడు సగంమంది పిల్లలను ఇంట్లో వదలి పెట్టడం మంచిది" అన్నాడు.

ఆ తల్లి కండక్టరు వైపు తీక్షణంగా చూస్తూ "ఇప్పుడు నే నదే చేశాను" అన్నది